




# అడుగంటుతున్న జలాశయాలు



- ఎండిన కాలువలు, బీడువారిన పొలాలు
- దశాబ్ద కాలంలో ఎన్నడూ లేని దుస్థితి

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 30: గత దశాబ్ద కాలంలో ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు ఎన్నడూ లేని దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్నారు. ఆంధ్ర రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రాలకు సాగు, తాగు నీటిని పుష్కలంగా అందిస్తున్న శ్రీశైలం జలాశయంతోపాటు తుంగభద్ర జలాశయాలు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. ఫలితంగా నిన్న మొన్నటి దాకా కాస్తో.. కూస్తో నీరు ఉండిన కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ, గాజులదిన్నె మొదలైనవి ఎండిపోయాయి. ఆ కాలువల నుంచి నీటిధారలు లేక పొలాలు బీడువారుతున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన జలాశయాలతోపాటు చిన్న నీటి వనరుల ద్వారా దాదాపు 6 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలకు నీరందిస్తున్నారు. ఈసారి జూన్ నుంచి వాన జాడ లేకపోవడంతో వరద ప్రవాహం ఆగస్టుకే ఆగిపోయింది. దీంతో బొటాబొటి నీటి నిల్వలు చేరుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సీజన్‌లో కేసీ కెనాల్, ఎల్లెల్సీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ తదితర ప్రధాన కాలువల ద్వారా అతికష్టమ్మీద అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రబీలో ఆరుతడి పంటలకైనా నీరు ఇస్తారేమోనని రైతులు ఎదురు చూసినా తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవడానికే తీవ్ర ఇబ్బందులు తప్పేట్లు లేవు. ఈ పరిస్థితుల్లో రబీ పంటలకు నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వలేమని అధికారులు చెప్పడంతో రైతులు పంటల సాగును విరమించుకున్నారు. రబీలో దాదాపు ప్రధాన కాలువల కింద ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఈసారి ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోవడంతో పొలాలన్నీ బీడువారిపోయాయి.

- ఏపీతోపాటు పక్క రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకకు కూడా నీరందించే ఏకైక మార్గంగా ఉన్న శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం 49.83 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. గత సంవత్సరం 80 టీఎంసీల దాకా ఇదే సమయానికి నిల్వ ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, గత సంవత్సరం దాదాపు ఏడు సార్లు పూర్తిగా నిండడంతో దిగువకు వదిలారు. ఈసారి మొదటి నుంచి ఆ పరిస్థితి కనిపించలేదు. అదేవిధంగా కర్నూలు తాగునీటి అవసరాలు తీరుస్తున్న సుంకేసుల జలాశయంలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 1.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.881 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. కర్నూలు తాగునీటి అవసరాల కోసం ప్రతి రోజూ 159 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. గాజులదిన్నె జలాశయంలో 4.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికిగాను 1.845 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూన్ వరకు ఎమ్మిగనూరు, కోడుమూరు, డోన్‌తోపాటు కర్నూలు తాగునీటి అవసరాలను ఈ కొద్దిపాటి నీటితో ఎలా సర్దుబాటు చేయాలో అర్థంగాక అధికారులు తలపట్టుక్కూర్చున్నారు. క్రిష్ణగిరి జలాశయంలో 0.164 టీఎంసీలకుగాను 0.68 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. జూన్ వరకు తాగునీటి అవసరాలను ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు ఏవిధంగా అందించాలో అర్థం కావడం లేదని జలవనరుల శాఖ అధికారులు అంటున్నారు.



- తుంగభద్ర జలాశయంలో 105.788 నీటి నిల్వ సామర్థ్యం ఉండాలి. గత సంవత్సరం ఇదే సమయానికి 70 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రస్తుతం 10.286 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉందని, ఎగువ నుంచి చుక్కనీటి ప్రవాహం కూడా జలాశయంలోకి రావడం లేదని, ఈ పరిస్థితుల్లో వచ్చే జూన్ వరకు తాగునీటి అవసరాలను ఏవిధంగా తీర్చాలో అర్థం కాని పరిస్థితి నెలకొందని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంలో తుంగభద్ర జలాశయంలో ఈ పరిస్థితి నెలకొనడం ఇదే మొదటిసారి అంటున్నారు.

**తాగునీటి అవసరాలకు ఇబ్బందులు ఉన్నాయి**

గత సంవత్సరం వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రధాన జలాశయాలతోపాటు మధ్యతరహా, చిన్ననీటి తరహా జలాశయాల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేరలేదు. జూన్ వరకు జలాశయాల్లో ఉన్న కొద్ది పాటి నీటితోనే ప్రజల తాగునీటి అవసరాలను సర్దుబాటు చేయాల్సి ఉంది. నీటి వృథాను అరికట్టి ఏదోవిధంగా తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

**- రెడ్డి శేఖర్ రెడ్డి, ఎస్ఈ**

## సచివాలయంలో ఏసీబీ దాడులు

- వీఆర్వో, వీఆర్ఏలపై కేసు నమోదు
- పాసు పుస్తకాలు ఇప్పించేందుకు రూ. 10వేలు డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన హెచ్.కైరవాడి రైతులు



హెచ్ కైరవాడి వీఆర్వో, వీఆర్ఏను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

గోనెగండ్ల, జనవరి 30: గోనెగండ్ల మండల పరిధిలోని హెచ్‌కైరవాడి గ్రామ సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏసీబీ అధికారులు పథకం ప్రకారం దాడులు చేశారు. వీఆర్వో రామకృష్ణ, వీఆర్ఏ(తలారి) మల్లేష్ రైతుల నుంచి లంచంగా డబ్బులు తీసుకుంటూ పట్టుబడ్డారు. హెచ్ కైరవాడి గ్రామానికి చెందిన రంగస్వామి, హనుమంతు, శివశర్మ, విష్ణు, మహేష్‌లకు సర్వే నెంబరు 239/2, 240-5, 242లో 9.45 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం వారికి వారసత్వంగా వచ్చింది. అయితే వారి పొలాన్ని విభాగాలు చేసి అడంగల్ ఎక్కించి, పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు వీఆర్వో రామకృష్ణ రూ.10వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో హనుమంతు, రంగస్వామి కర్నూలులోని ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారులు పన్నిన పథకం ప్రకారం.. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు డబ్బులు ఇవ్వడానికి రైతులు సచివాలయం వెళ్లారు. తలారి మల్లేష్ ద్వారా రూ. 10 వేలు రామకృష్ణ తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి, సీఐ తేజేశ్వరావు, కృష్ణారెడ్డి, వంశానాథ్ పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి విలేకరులతో మాట్లాడుతూ వీఆర్వో రామకృష్ణ, తలారి మల్లేష్‌పై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. అధికారులు పనులకు డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే 14400 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు.

## స్థాయిని మరచి విమర్శించకండి

- రాజకీయాల్లో దిగుజారుడుతనం మంచిది కాదు
- ఆదోని ఎమ్మెల్యేను హెచ్చరించిన మీనాక్షినాయుడు

**ఆదోని, జనవరి 30 :** టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును విమర్శించేటప్పుడు స్థాయిని మర్చిపోరాదని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు హితువు పలికారు. మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మీనాక్షినాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రాజకీయాల్లో దిగజారుడుతనం మంచిది కాదని హితవుపలికారు. క్రికెట్ బెట్టింగ్, భూకబ్జాలు చేయనప్పుడు ఎమ్మెల్యేకు ఎందుకంత ఉలుకని ప్రశ్నించారు. క్రికెట్ బెట్టింగ్‌లో పెద్ద ఎత్తున నగదు పట్టుకున్నందుకు కేసుకు భయపడి త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరామ్‌ను ఎవరు బదిలీ చేయించారో? ఆదోని పట్టణ ప్రజలకు బాగా తెలుసన్నారు. మచ్చలేని నాయకుడు చంద్రబాబును ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతావా..? అంటూ మండిపడ్డారు. మీ కుటుంబ సభ్యుల పేర ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని సాక్ష్యాధారాలతో టీడీపీ మైనార్టీ నాయకుడు ఉమ్మీ సలీం బహిరంగంగా ఆరోపిస్తే నోరు తెరవలేదేం? అని ప్రశ్నించారు. వంద రోజులు ఆగితే వైసీపీ బండారం ప్రజలే బయట పెడుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆదోనిలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు బత్తిన కుబేర్‌నాథ్, ఉమ్మి సలీం, శ్రీకాంత్ రెడ్డి, రామస్వామి, అఫ్సర్‌బాషా, గుంటెప్ప, శివప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



మంత్రాలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

## శ్రీమఠం హుండీ ఆదాయం రూ.4.15 కోట్లు

**మంత్రాలయం, జనవరి 30:** కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం గతంలో కన్నా ఎక్కువగా వచ్చింది. మఠం గురురాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది, భక్తులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు. 2023 డిసెంబరు 28 నుంచి జనవరి 29 వరకు 33 రోజులకు సంబంధించి రూ.4,15,32,738 నగదుతో పాటు 3642 గ్రాముల వెండి, 44 గ్రాములు బంగారు, విదేశీ డాలర్లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. గతంలో హుండీ ఆదాయం రూ.4 కోట్లకు తక్కువగానే రాగా, ఈ ఏడాది 33 రోజులకు రూ.4.15 కోట్లు వచ్చిందని వారు చెప్పారు. శ్రీమఠం ఉద్యోగుల సమష్టి కృషి వల్లే మఠానికి హుండీ ఆదాయం పెరిగిందని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. సూపరింటెండెంట్ జేపీ స్వామి, ఆడిటర్ దత్తుస్వామి ఉన్నారు.

## 40 మంది ఎంపీడీవోలు రిలీవ్

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 30:** సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 40 ఎంపీడీవోలను రిలీవ్ చేస్తూ జిల్లా పరిషత్ సీఈవో జి.నాసర రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇటీవల సాధారణ ఎన్నికల ప్రక్రియను పురస్కరించుకుని ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి 42 మంది ఎంపీడీవోలను అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు బదిలీ చేశారు. వీరిలో కర్నూలు ఎంపీడీవో ఆజాంఖాన్ ఆకస్మిక మృతి చెందారు. అదేవిధంగా జూపాడుబంగ్లా ఎంపీడీవో మంజులవాణి నంద్యాల డీపీఓ పని చేస్తుండటంతో ఇద్దరి బదిలీలు నిలిపివేశారు. మిగిలిన 40 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

## సర్పంచ్‌ల నిరసన దీక్ష

**కర్నూలు(కలెక్టరేట్), జనవరి 30:** కర్నూలు నగరంలోని ధర్నా చౌక్‌లో మంగళవారం సర్పంచ్‌లు నిరసన దీక్ష చేపట్టారు. వీరి దీక్షకు టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, నంద్యాల జిల్లా నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, జనసేన పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు, తదితరులు నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. ఏపీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్రు ప్రతాప్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా మారరని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల న్యాయమైన 16 డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. మహాత్మా గాంధీ వర్ధంతి రోజున నల్ల కండువా, బ్యాడ్జీలతో సర్పంచ్‌లు నిరసన తెలిపే దుస్థితి తీసుకురావడం వైసీపీ ప్రభుత్వానికి సిగ్గుచేటని మండిపడ్డారు. సర్పంచ్, ఎంపీటీసీల గౌరవ వేతనాలు రూ.15 వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలకు పెంచాలని కోరారు. వైసీపీ మద్దతుతో గెలిచిన కర్నూలు మండలంలోని గొందిపర్ల సర్పంచ్ శ్రీనివాసులు కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి భూమా వెంకట వేణుగోపాల్ రెడ్డి, సహాయ కార్యదర్శి రామ చంద్రుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు భాగ్యరత్న, కార్యదర్శి దమోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుధాకర్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




నిరసన దీక్షకు మద్దతు తెలుపుతున్న టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

## బడుగులను మోసగించిన జగన్

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు**



టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీటీ నాయుడు

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** బడుగు, బలహీన వర్గాలను సీఎం జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు బెంగుళూరుకు చెందిన ఇతినా సంస్థ ఆస్పరి ప్రాంతంలో పరిశ్రమ నెలకొల్పేందుకు 2006లో ఎకరా రూ.52వేల చొప్పున 443 ఎకరాలు కొనుగోలు చేసిందన్నారు ఎంతో మంది ఎస్సీ, బీసీ పేద బడుగు వర్గాల వారు భూములిస్తే తమకుటుంబాల వారికి ఉద్యోగఅవకాశాలు వస్తాయని భావించారన్నారు. అక్కడ నేటికీ ఎలాంటి పరిశ్రమలు నెలకొల్పలేదన్నారు. అయితే ఆ భూముల్లో కొంతభాగాన్ని నేడు మంత్రి జయరాం చౌకగా కొనుగోలు చేశాడన్నారు. తన బినామీలను అడ్డుపెట్టుకుని భూములపై కన్నేశాడని ఆరోపించారు. బినామీ పేర్లతో ఆ భూముల్లో క్రయవిక్రయాలు జరిపి రూ.48 కోట్ల అక్రమాలు చేశాడన్నారు. ఆ అక్రమార్జనలో వాటా ఇవ్వలేదనే సీఎం జగన్ మంత్రి గుమ్మనూరును పక్కన పెట్టాడన్నారు. అందుకే ఆయనకు ఆలూరు టికెట్‌ను రాకుండా చేశారని ఆరోపించారు.

ఇప్పటికైనా గతంలో జగన్‌తో జరిగిన చీకటి ఒప్పందాన్ని, అవినీతి భాగోతాన్ని బయటపెట్టాలని మంత్రి గుమ్మనూరు జయరాంకు సూచించారు. కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రస్తుత వైసీపీ ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీనవర్గాల నష్టాలకు గురవుతున్నారన్నారు. అన్ని విధాలుగా వారిపై వైసీపీ నేతలు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కానీ అధికార పార్టీ నేతలు మాత్రం ప్రగల్భాలు పలుకుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీలను మభ్యపెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు శ్రీనివాస్ భట్, డి.జేమ్స్, సత్రం రామకృష్ణుడు, అబ్బాస్, ముంతాజ్, పెరపోగు రాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్యాలయాలు ఖాళీ చేయండి

**ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి శ్రీమఠం నోటీసులు**

**మంత్రాలయం, జనవరి 30:** తమ భూముల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను ఖాళీ చేయాలని శ్రీరాఘవేంద్ర స్వామి మఠం అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్‌కు మంగళవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను శ్రీమఠం పేరు మీదుగా అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. 1968లో అప్పటి పీఠాధిపతి శ్రీసుజయీంద్రతీర్థులు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ కోసం సర్వే.నెంబర్.64/1లో 1.19 ఎకరాల భూమిని కేటాయించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు దానిని సంరక్షించుకుంటూ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. దీనిపై శ్రీమఠం అధికారులు హైకోర్టుకు వెళ్లి 2021లో శ్రీమఠానికే ఇవ్వాలని జడ్జిమెంటు వచ్చింది. ఇందులో భాగంగా సర్కిల్‌లోని ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ భూమిని స్వాధీనం చేసుకుని ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న మాధవరం రోడ్డులో చెట్నహల్లి-మంత్రాలయం సరిహద్దు ప్రాంతమైన 11/3లోని 1.55 ఎకరాలు ఆర్‌అండ్‌బీకి బదిలీ చేస్తూ రిజిస్ట్రేషన్ ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒప్పందం చేసుకున్నారు. ఆర్‌అండ్‌బీ సర్కిల్ శ్రీమఠం అధీనంలోకి రావడంతో అప్పటికే నోటీసులు తీసుకున్న మంత్రాలయం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, జూనియర్ కళాశాల వంటి ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు ఇవ్వడంతో ప్రభుత్వ అధికారుల్లో గుబులు మొదలైంది. శ్రీమఠాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఈ స్థలాలు అవసరమని, వెంటనే ఖాళీ చేయాలని తమరు కోరితే.. వేరే స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఇస్తామని శ్రీమఠం అధికారులు నోటీసులో పేర్కొన్నారు. అయితే గ్రామంలో విలువైన స్థలం ప్రజలకు అందుబాటులో ఉన్న స్థలాలను వదిలి దూర ప్రాంతాల్లో ఆఫీసులను నిర్మించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయనీ ప్రభుత్వ అధికారులు వాపోతున్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ భవనాన్ని ఆర్‌అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి, జేఈ సురేష్‌లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, సూపరింటెండెంట్ జేపీ స్వాములు ఒకరికొకరు రిజిస్ట్రేషన్ బదలాయింపు చేసుకోవడం మంత్రాలయంలో చర్చనీయాంశంగా మారింది.




మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్

# ప్రాక్టికల్స్ పేరుతో దోపిడీ



- విద్యార్థుల నుంచి భారీగా డబ్బు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు
- నాన్ జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్ పరీక్షలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 27,890 మంది విద్యార్థులు
- పరీక్షలకు 186 కేంద్రాలు

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 30:** ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పేరుతో ప్రైవేట్ కళాశాలల యజమానులు విద్యార్థులను దోపిడీ చేస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.1000 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే తక్కువ మార్కులు వస్తే తమకు సంబంధం లేదని విద్యార్థులను బెదిరిస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో జరుగుతున్న ఈ దందాను అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బైపీసీ, ఎంపీసీ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు మొత్తం 27,890 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 186 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ఫిబ్రవరి 5 నుంచి 20వ తేది వరకు ఇంటర్ సైన్స్ ప్రాక్టికల్స్ కొనసాగుతాయి. ఇంటర్మీడియట్ అధికారులు పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంటర్ జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 7వ తేది వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయి. నాన్ జంబ్లింగ్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరీక్ష కేంద్రాలను గుర్తించి బోర్డు అధికారుల నుంచి అనుమతి పొందారు. ఇప్పటికే ఆయా కేంద్రాలను పరిశీలించి, ఏమైనా కొరత ఉంటే, సరిద్దిదుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు ఆర్ఐఓ సూచనలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 27,890 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 318 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులు జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో మొత్తం 27,890 మంది ఉన్నారు. ఫిబ్రవరి 5 నుంచి జరిగే ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 5,767 మంది హాజరవుతున్నారు. ఈ విద్యార్థుల కోసం 42 పరీక్ష కేంద్రాలను గుర్తించారు. ఇందులో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థులు 3,449 మంది కాగా, నంద్యాలకు చెందిన విద్యార్థులు 2,381 మంది ఉన్నారు. అలాగే, ఇంటర్ జనరల్ కోర్సు విద్యార్థులు 22,123 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 144 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో 14,534 మంది ఉన్నారు. 92 కేంద్రాలను, నంద్యాల జిల్లాలో 7,589 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం 52 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు.





### ఫీజుల పేరుతో దందా

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో కళాశాలల యాజమ్యానాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూళ్లు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షల ఫీజుతో పాటు ప్రాక్టికల్స్‌ను కలుపుకొని జనరల్ కోర్సు విద్యార్థులు రూ.560 + 250 మొత్తం కలిపి రూ.810 ఒక్కో విద్యార్థి చెల్లించాలి. అలాగే, ఒకేషనల్ కోర్సు ప్రథమ సంవత్సరం విద్యార్థులు బ్రిడ్జి కోర్సుతో రూ.1450 చెల్లించాలి. అలాగే, రెండో సంవత్సరం విద్యారులు రూ.1800 చెల్లించాలి. ఈ మొత్తానికి ఆదనంగా రూ.1000 నుంచి రూ.1500 వరకు ప్రైవేట్ కళాశాలల యజమానులు వసూలు చేస్తున్నారు. కళాశాలలో విద్యార్థులకు ప్రాక్టికల్స్ చేయించకుండా పరీక్షలప్పుడు భారీగా డబ్బులు వసూలు చేయడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



### అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం



ఇంటర్మీడియట్ సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షల పేరుతో ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల యజమాన్యాలు విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూళ్లు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇంటర్మీడియట్ బోర్డు నిర్ణయించిన ఫీజులు మాత్రమే వసూలు చేయాలి. ఎక్కడైనా అదనంగా వసూలు చేస్తున్నట్లు తమకు సమాచారం అందిస్తే ఆ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, ఆర్ఐవో

## మహిళ ఆత్మహత్య

### మూడు రోజుల క్రితం సహచరుడి మృతితో..



అంపమ్మ (ఫైల్)

**కోసిగి, జనవరి 30:** కోసిగిలోని సజ్జలగూడెం రోడ్డులోని సిద్దప్పపాలెం శ్మశానవాటికలో అంపమ్మ (33) అనే మహిళ పురుగుల మందు తాగి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు. కౌతాళం మండలం వల్లూరు గ్రామానికి చెందిన అంపమ్మకు, హాల్వి గ్రామానికి చెందిన రమేష్‌కు 15 ఏళ్ల క్రితమే వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అయితే.. అంప మ్మ ఆరు సంవత్సరాల కింద భర్త నుంచి విడిపోయి పుట్టినిల్లు అయిన వల్లూరు గ్రామంలో ఉంటోంది. పిల్లలు మాత్రం భర్త రమేష్ దగ్గర ఉంటు న్నారు. గత కొంత కాలంగా కోసిగిలోని 9వ వార్డుకు చెందిన రాముడుతో ఆమె సహజీవనం చేస్తోంది. రాముడు మూడు రోజుల క్రితం బహిర్భూమికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం సిద్దప్పపాలెం శ్మశాన వాటికలో సమాధి దగ్గర పురుగుల మందు తాగి అంపమ్మ విగతజీవిగా కనిపించింది. ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. సహచరుడు రాముడి మృతిని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతురాలి తల్లి అమరమ్మ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే మృతదే హాన్ని తీసికెళ్లడానికి ఎవరూ రాకపోవడంతో ఆదోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అనాథ శవంగా అంత్యక్రియలు నిర్వహించినట్లు కోసిగి పోలీసులు తెలిపారు.

## క్యాన్సర్ హాస్పిటల్స్‌కు నర్సింగ్ సూపరింటెండెంట్లు



పదోన్నతి పొందిన వారికి క్యాప్‌లను పెడుతున్న నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 తులసమ్మ

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 30:** స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా జి.అనసూయ, కె.రాజ్యలక్ష్మి నియమితుల య్యారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి మంగళవారం ఇద్దరిని జాయిన్ చేసుకున్నారు. తాత్కాలికంగా ఆసుపత్రిలోనే విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1 వెంకట తులసమ్మ కొత్తగా పదోన్నతులు పొందిన నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గ్రేడ్-2లకు క్యాప్‌లను పెట్టారు. అనంతరం వారికి పలువురు హెడ్ నర్సులు అభినందనలు తెలిపారు. కొత్తగా ఏర్పాటు కానున్న స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2లుగా ఇద్దరు బాధ్యతలు చేపట్టనున్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు కె.ఉమాదేవి, ఎం.లీల, విమల, ఎంఎన్ రమణమ్మ, ఆదిలక్ష్మి, జి.ఉమాదేవి, ఎం.లీలావతి పాల్గొన్నారు.

## సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు

### నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

**ఓర్వకల్లు, జనవరి 30:** టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పు సీఎం జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు అని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నా రు. మంగళవారం మండ లంలోని హుశేనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుపై పెట్టిన ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో చంద్రబాబుకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. చంద్రబాబును ఇబ్బంది పెట్టాలని చూస్తున్న జగన్ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెంప పెట్టు లాంటిదన్నారు. సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్ రెడ్డి వైసీపీ నాయకులు సిగ్గు పడాలన్నారు. అక్రమ కేసులు పెట్టి వాటిని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలని జగన్ రెడ్డి చూస్తున్నారనీ అన్నారు. వైసీపీపై అసంతృప్తితో ఎమ్మెల్యేలు, ఎంపీలు పార్టీని విడిచిపెడుతున్నారన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహబూబ్‌బాషా, కేవీ మధు, సుధాకర్, రామగోవిందు, బజారు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం రెస్టారెంట్ల టెండరుకు దరఖాస్తులు

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 30:** ఏపీ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన టూరిజం రెస్టారెంట్లను టెండరు ద్వారా లీజుకు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకేసుల డ్యామ్ వద్ద నిర్మాణ దశలో నిలిచిపోయిన రెస్టారెంటు, ఓర్వకల్లు మండలం కేతవరం వద్ద నిర్మించిన రెస్టారెంటు, ఉరుకుంద ఈరన్నస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన రెస్టారెంట్లను 20 సంవత్సరాల లీజుకు ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన రెస్టారెంటును పూర్తిగా అభివృద్ధి చేసి పర్యాటకులకు వసతులు కల్పించుకోవాలని ఆమె తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 5వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులో జిల్లా పర్యాటక అండ్ సాంస్కృతిక అధికారి కార్యాలయంలో టెండరు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 6309942034, 8247704152 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## సెమిస్టర్ ఫలితాలు విడుదల

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో రెండో సెమిస్టర్‌లో 107కుగాను 52 మంది ఉత్తీర్ణత సాధించారు. 4వ సెమిస్టర్‌లో 70కి 59 మంది, సప్లిమెంటరీలో 2వ సెమిస్టర్‌లో 35 మందికి 31. 4వసెమిస్టర్‌లో 24 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

## 5 నాటికి పనులు పూర్తి చేయండి: కలెక్టర్

**కర్నూలు(కలెక్టరేట్), జనవరి 30:** ఫిబ్రవరి 5వ తేది నాటికి అన్ని పోలింగ్ కేంద్రాల్లో పెండింగ్ ఉన్న మౌలిక సదుపాయాలను తర్వితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన సదుపాయాలపై సంబంధిత శాఖలు చేస్తున్న పనులపై ఆరా తీశారు. ఈ సమావేశంలో డీఆర్వో మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జేసీ



స్ట్రాంగ్‌రూం, కౌటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య

**కల్లూరు, జనవరి 30:** సాధారణ ఎన్నికల నేపథ్యంలో భాగంగా రాయలసీమ యూనివర్శిటీలో స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్, పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య పరిశీలించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ నగర శివారులోని రాయలసీమ యూనివర్శిటీలో పర్యటించారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోలింగ్ అనంతరం ఈవీఎంలు భద్రపరిచే గదులు, కౌంటింగ్ కేంద్రాల్లో వసతుల ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలక్షన్ విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సాధారణ ఎన్నికల్లో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. కల్లూరు తహసీల్దారు టివి. రమేష్‌బాబు హాజరయ్యారు.

## దిశా వన్ స్టాఫ్ సెంటర్ తనిఖీ



రికార్డులను తనిఖీ చేస్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు

**కర్నూలు(లీగల్), జనవరి 30:** స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని దిశా వన్ స్టాప్ కేంద్రం, మానసిక వికలాంగుల వార్డును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు మంగళ వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వికలాంగులకు లీగల్ సర్వీసెస్ చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయాన్ని అందించడానికి అర్హులని తెలిపారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేసి అక్కడ ఉంటున్న వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీల్లో మానసిక వైద్యుడు డా.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

## సాంకేతిక ఫలాలు రైతులకు దక్కాలి

### రాయలసీమ వర్సిటీ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** సాంకేతిక ఫలాలు సాధారణ రైతులకు దక్కాలని రాయలసీమ యూనివర్సిటీ సుధీర్ ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. మంగళవారం వర్సిటీలోని సెనెట్‌హాలులో 'రాష్ట్ర అభివృద్ధి-సాంకేతికత' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విత్తనం నాటే దశ నుంచి పండిన పంటను మంచి ధరకు విక్రయించే వరకు రైతుకు అన్నివిధాలా లాభం చేకూరాలన్నారు. అందుకోసం రైతులు ప్రభుత్వ అందిస్తున్న సేవలతో పాటు మర్కెటింగ్ సౌకర్యాలను అందిపుచ్చు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు లోకానందరెడ్డి, అజీమ్ ప్రేమ్‌జీ, టి.వెంకట సాయిశశిధర్, రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ వెంకట సుందరానంద పుచ్చా, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాదరెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదు కిడ్నాప్ కేసులో కర్నూలు ఎస్ఐ ప్రమేయం

- ఎస్ఐ కోసం పోలీసుల గాలింపు
- పరారీలో నిందితుడు

**కర్నూలు, జనవరి 30:** హైదరాబాదులోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన కిడ్నాప్ కేసుల్లో కర్నూలు పని చేస్తున్న ఎస్ఐ సృజన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. సృజన్ డీఐజీ కార్యాలయంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. హైదరాబాదులోని ఏజేఏ యాడ్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ఎండీ సుగుణాకర శెట్టిని బెదిరించి రూ.10 కోట్లు డిమాండ్ చేశాడు. రంజిత్ అనే మాజీ పోలీసు అధికారితో కలిసి సృజన్, మరికొంతమంది ఏజేఏ యాడ్స్ సాఫ్ట్‌వేర్ కంపె నీకి ఏపీ సీఐడీ పోలీసులను అని చెప్పి తనిఖీ చేయాలని బెదిరించారు. తనిఖీలు ఆపాలంటే ఖర్చు అవుతుందని, బేరాలు మొదలు పెట్టి రూ.10 కోట్లు డిమాండ్ చేశారు. ఈ కేసులో మొత్తం 10 మంది నిందితులుగా ఉన్నారు. పోలీసులు 9 మందిని అరెస్టు చేయగా.. సృజన్ పరారిలో ఉన్నాడు. సృజన్ 2009 బ్యాచ్‌కు చెందిన ఆర్ఎస్ఐ. 2012లో సివిల్ ఎస్ఐగా వచ్చాడు. కర్నూలు జిల్లాలో సి.బెళగల్, కర్నూలు ట్రాఫిక్, ట్రాన్స్‌కో, సీఐడీ విభాగాల్లో పని చేశాడు. ప్రస్తుతం డీఐజీ కార్యాలయంలో ఉన్నారు. 9 మంది నిందితుల్లో కర్నూలు బీ.క్యాంపు బిషప్ చర్చి ప్రాంతానికి చెందిన సందీప్ కుమార్ సూడో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సీఐడీగా వ్యవహరించాడు.

## ఇద్దరు వన్యప్రాణి వేటగాళ్ల అరెస్టు



అటవీ అధికారులకు చిక్కిన చుక్కల దుప్పిని హతమార్చిన నిందితులు

**ఆత్మకూరు, జనవరి 30:** ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో విద్యుత్‌షాక్ ద్వారా వన్యప్రాణులను వేటాడుతున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు రేంజ్ అధికారి పట్టాభి మాట్లాడుతూ.. ఈనెల 29న సోమవారం చిన్నగుమ్మడాపురం గ్రామానికి చెందిన చిన్నపుల్లయ్య, ఎర్రమఠం గ్రామానికి చెందిన వరదన సామేలుతో పాటు పులిచర్ల మూగన్న అనే వ్యక్తులు కరెంట్ తీగలను ఏర్పాటు చేసి చుక్కల దుప్పిని హతమార్చారన్నారు. ఈ ఘటనపై తమకు సమాచారం రావడంతో నిందితులను పట్టుకునే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. వీరిలో చిన్నపుల్లన్న, సామేలును అదుపులోకి తీసుకోవడంతో పాటు కిలో చుక్కల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు మూగన్న అక్కడి నుంచి పరారైనట్లు పేర్కొన్నారు. నిందితులను మంగళవారం ఆత్మకూరు జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా 14రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్ఓ నాగేశ్వరరావు, ఎఫ్‌బీవో పాములేటి, స్ట్రైకింగ్ ఫోర్స్, ప్రొటెక్షన్ వాచర్లు, యాంటి పోచింగ్ సిబ్బంది ఉన్నట్లు చెప్పారు.

## టీడీపీ, జనసేన ప్రభుత్వం రావడం ఖాయం

▸▸ మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత



31వ వార్డు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న గౌరు చరిత

**కల్లూరు, జనవరి 30:** సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నాయని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 31వ వార్డు శరీన్‌నగర్ నాయీ బ్రాహ్మణ కాలనీలో చేపట్టిన రచ్చబండ, బాబు ష్యూ రిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆమె ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు పం పిణీ చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ ఇన్నర్‌రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటి షన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నంది కొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ శైలజాయాదవ్, కర్నూలు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, ప్రభా కర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, మాదేష్, వంగాల జనార్ధన్‌రెడ్డి, ఆదం, మల్లికార్జున, రామకృష్ణ. క్రిష్ణన్న, సువర్ణ, రేణుక, కల్లూరు మాజీ సింగిల్ విండో ఛైర్మన్ ఎస్వీ.రామకృష్ణ, జె.గంగాధర్‌గౌడ్, కాసాని మహేష్ గౌడ్, పీయూ మాదన్న పాల్గొన్నారు.

● **సర్పంచులకు గౌరు మద్దతు:** తమ డిమాండ్లను పరిష్క రించాలని కోరుతూ సర్పంచ్‌లు ధర్నా చౌక్‌వద్ద చేపట్టిన నిరసనకు టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి మద్దతు తెలిపారు.

## సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టు

- కోడుమూరులో ఫిబ్రవరి 3న జయహో బీసీ
- టీడీపీ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్


కరపత్రాలను విడుదల చేస్తున్న టీడీపీ నాయకులు

**కోడుమూరు, జనవరి 30:** టీడీపీ అధినేత చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసుల్లో సుప్రీం కోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని పార్టీ కోడుమూరు ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని వైసీపీ ప్రభుత్వం వేసిన పిటిషన్ సుప్రీం కోర్టు కొట్టివేసిందన్నారు. జగన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినప్పటికీ ప్రజలు చంద్రబాబు వెంట ఉన్నారన్నారు. ఫిబ్రవరి 3న కోడుమూరు పట్టణంలోని కోట్ల సర్కిల్లో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జయహో బీసీ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కర్నూలు పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడు, మాజీ సర్పంచు కేఈ రాంబాబు, సీబీ లత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎల్లప్పనాయుడు, మాదన్న, బడేసాగౌడ్, వీరేష్, హనుమంతప్ప, సురేంద్ర పాల్గొన్నారు.

## ఉచితంగా హైపో ద్రావణం పంపిణీ

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** నగరంలో పెరిగిపోయినా దోమలను అరికట్టేందుకు ప్రజలకు ఉచితంగా హైపో ద్రావణం పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం నగరంలోని ఎన్ ఆర్‌పేటలో 49వ వార్డు టీడీపీ నాయకుడు కౌశిక్ ఆధ్వర్యంలో ఎంసీ నాగప్ప వీధి, రోడ్డునెంబర్ 8,9 ప్రాంతాల్లో మురుగు కాలువలు, అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాల్లో హైపో ద్రావణం పిచికారి చేశారు. టీజీ భరత్ సాయంతో నగరంలో దోమలను తరిమికొట్టేందుకు హైపో ద్రావణాన్ని పిచికారి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూసుఫ్, అన్వర్ బాషా, రామమూర్తి, మహేష్, సునీల్ పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(కల్చరల్), జనవరి 30:** నగరంలో దోమల నివారణకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్, టీడీపీ నాయకురాలు నగరూరు శమంతకమణి డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని 46వ వార్డు నరసింహారెడ్డి నగర్‌లో నివాస ప్రాంతాల్లోగల మురుగు కాలువల్లో ఆమె హైపో ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఆమె మాట్లాడుతూ దోమల నివారణపై అధికారులు చర్యలు తీసుకోకపోతే పిల్లలు, వృద్ధులు డెంగీ, మలేరియా జ్వరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## పాములు, దోమల నుంచి రక్షించండి

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 30:** నగర శివారులోని శ్రీలక్ష్మీ విలాస్ కాలనీ ప్రజలను పాములు, దోమల నుంచి రక్షించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. కాలనీలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులతో కలిసి కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ ఇంటి పన్నులు చెల్లిస్తున్న కాలనీ ఎలాంటి అభివృద్ధి చెందలేదని అన్నారు. కాలనీలో కొంతమందికి మాత్రమే తాగునీరు వస్తుందని, వీధి దీపాలు వెలగక, రోడ్ల నిర్మాణం జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటీవల ఓ బాలిక పాముకాటు గురైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. ఇప్పటి వరకు వీధి లైట్లు వేయలేదన్నారు. అనంతరం అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు.

## సంక్షేమ పథకాలను వినియోగించుకోండి: ఎమ్మెల్యే


ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

**ఓర్వకల్లు, జనవరి 30:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. గ్రామంలో ఎవరికైనా ఇంటి స్థలాలు రాకపోతే వారికి ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ చంద్రగోవర్ధనమ్మ, ఎంపీపీ తిప్పన్న, తహసీల్దార్ శివప్రసాద్ రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, వైసీపీ నాయకులు చంద్రపెద్దస్వామి, గోప రమణారెడ్డి, నాగతిరుపాలు, వెంగన్న, చెన్నారెడ్డి, గోప మోహన్ రెడ్డి, రామేశ్వరరెడ్డి, షాలు బాషా, యువరాజు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఆర్‌యూ వీసీ


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌యూ వీసీ

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** కలెక్టర్ జి.సృజనను రాయలసీమ యూనివర్సిటీ ఉపకు లపతి సుధీర్ ప్రేమ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉదయం కలెక్టర్ ను చాంబర్‌లో కలిసి యూని వర్సిటీ పరిస్థితులపై చర్చించారు. నూతన ఉపకులపతిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం యూనివర్సిటీ పాలనా తీరును కలెక్టర్‌కు వివ రించారు. రాబోయే రోజుల్లో అనుసరిచాల్సిన విధివిధానాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



# గాంధీజీకి ఘన నివాళి

**కర్నూలు(అర్బన్), జనవరి 30:** జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం గాంధీజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి యువత గాంధీజీ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నంద్యాల నాగేంద్రకుమార్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, కార్పొరేటర్ కె.పరమేష్, నగర పార్టీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, ఇల్లూరు లక్ష్మయ్య, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

● **కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు కే.బాబురావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయంలో నుంచి కొండారెడ్డి బురుజు వద్దకు ర్యాలీగా వెళ్లి గాంధీ పార్కులో విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీని బ్రిటిష్ పాలకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా సహనంతో భరించి చివరకు స్వాతంత్రం సంపాదించి పెట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకన్న, ఐఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బతుకన్న, డీసీసీ ప్రధాన కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్, సత్యానారాయణ గుప్త, జిల్లా అధ్యక్షులు ప్రమీల, ఖజా హుసేన్, పుష్పలీల, రాజేశ్వరీ, ఎజాజ్ పాల్గొన్నారు.

**కర్నూలు(కల్చరల్):** మహాత్మా గాంధీ సేవలు మరువలేనివని, అహింసా మార్గంలో స్వాతంత్రోద్యమాన్ని కొనసాగించిన మహనీయుడు అని ఏపీ స్టేట్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శెట్టి విజయకుమార్, రాయలసీమ జేఏసీ ఛైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు కొనియాడారు. మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా నగరంలో కలెక్టరేట్ ముందు ఉన్న గాంధీ విగ్రహానికి రాయలసీమ జేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ నేతల్లో గాంధీజీ ముందుంటారని అన్నారు. అహింసా మార్గంలో బ్రిటీషు వారినిదేశం విడిచివెళ్లేలా పోరాటం చేసిన గొప్ప యోధుడని శ్లాఘించారు. కార్యక్రమంలో వడ్ల శ్రీకాంత్, కొణిదెల శ్రీనివాస్, కటకం రామకృష్ణ, రమేష్, కిరణ్, దాస్ పాల్గొన్నారు.

**కర్నూలు(న్యూసిటీ):** గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కమిషనర్ భార్గవతేజ అన్నారు. మంగళవారం కౌన్సిల్ హాలులో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ జునైద్, ఇన్‌చార్జి సెక్రటరీ నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

**కర్నూలు(ఎడ్యుకేషన్):** స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ప్రసన్న కుమార్, విజయశేఖర్, జబిన్ అక్తర్, సుజాత, లక్ష్మి, పార్థసారధి పటేల్, సోమేష్, గిరిజారాణి, చిన్న మల్లేశ్వరుడు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఏ.క్యాంపులోని ఫైఫర్ ఫార్మశీ కళాశాలలో మంగళవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.జె.రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సి.బెళగల్:** గాంధీజీ ఆశయాలను నెరవేరుద్దామని తహసీల్దార్ శేషఫణి అన్నారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయ అవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి తహసీల్దార్ శేషఫణి, ఎంపీడీవో సందీప్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే మండలంలోని 18 గ్రామ సచివాలయాలలో గాంధీ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళి అర్పించారు.

**కర్నూలు(హాస్పిటల్):** గాంధీజీ వర్ధంతి సందర్భంగా నగరంలోని బుధవారపేటలో ఉన్న దళిత వాడలో పేద మహిళలకు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజం పలకడం, అహింసా విధానం అవలంబించడం గాంధీజీ నిజమైన ఆయుధాలని అన్నారు.


గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శెట్టి విజయకుమార్, కోనేటి వెంకటేశ్వర్లు


టీడీపీ కార్యాలయంలో..


గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నగర పాలక సంస్థ కార్యాలయంలో..


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ


బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో..

## 'కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి'

**కర్నూలు(కల్చరల్)/(హాస్పిటల్), జనవరి 30:** కుష్ఠువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స అందించాలని జిల్లా లెప్రసీ అండ్ ఎయిడ్స్ నియంత్రణ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్ అన్నారు. మంగళవారం నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఫార్మసీ కళాశాల్లో, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 'స్పర్శ' కుష్ఠువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా డాక్టర్ ఎల్ భాస్కర్, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.మల్లికార్జునరెడ్డి హాజరై ప్రసంగించారు. కళాశాల కరస్పాండెంట్ కే విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రమణ, హెల్త్ ఆఫీసర్ శంకర్‌రావు, కళాశాల కోఆర్డినేటర్లు ఎం. శ్రీరామ చంద్ర, పి.రేణుక పాల్గొన్నారు.

**లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో:** లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ కుష్ఠువ్యాధి దినోత్సవం సందర్భంగా నగర శివారు అభయగిరిలో కుష్ఠువ్యాధితో చికిత్స పొందుతున్న వారికి లయన్స్ క్లబ్ ప్రతి నిధులు రాఘవేంద్ర శెట్టి, మాణిక్య ప్రభు, వెంకటేశ్వర్లు, నాగరాజ గుప్త, పీవీ రాజ్‌కుమార్, లోకేశ్ నాలుగు బియ్యం ప్యాకెట్లు, కందిపప్పు, ఉప్మారవ్వ, పల్లీలు, మినపపప్పు, బెల్లం, చక్కెర, మంచి నూనె ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు దామెర ప్రభాకర్, దుర్గా నాగేశ్వరరావు, డాక్టర్ బాల మద్దయ్య, రామరాజ్, బీవీ రమణగౌడ్, శ్రీనివాసబోస్, పాండురంగారెడ్డి, శివరాం గౌడ్ పాల్గొన్నారు.

**కోడుమూరు:** మల్టీ డ్రగ్ తెరపి మందులు వాడటం వలన కుష్ఠు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. జాతీయ కుష్ఠు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక పంచాయతీ బోర్డు కార్యాలయంలో మంగళవారం కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంలో స్పర్శ లేని మచ్చలు, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు పాదాలపై బొబ్బలు రావడం వంటి లక్షణాలు కుష్ఠు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది నరసప్ప, కమాల్‌సాహెబ్, ఉమాదేవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ లింగన్న, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**గూడూరు:** జాతీయ కుష్ఠు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ పారా మెడి కల్ ఆఫీసర్ నారాయణ రావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేశారు. నగర పంచాయతీ ఛైర్మన్ జె వెంకటేశ్వర్లు, మేనేజర్ రవి కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ వైష్ణవి, వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష, హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణా రెడ్డి, సూపర్‌వైజర్ రాఘవయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సెలవులో డీసీపీ మోహన్‌కుమార్

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 30:** నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సిటీ ప్లానర్ యు.మోహన్‌కుమార్ నెలరోజులపాటు సెలవులో వెళ్లారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, నగర పాలక సంస్థ కమిషనర్‌కు మంగళవారం సెలవు లేఖ పంపించారు. ఆరోగ్యకారణాల రీత్యా వచ్చే నెల 28వ తేదీ వరకు ఆయన సెలవు పెట్టారు. ఇప్పటికే సిటీ ప్లానర్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం, డీసీపీ నెలరోజులపాటు సెలవు పెట్టడం, ఇదే విభాగంలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హరీష్ చౌదరి అనంతపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ఏడాది పాటు డిప్యుటేషన్‌పై వెళ్లారు.

## పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి

**కర్నూలు(న్యూసిటీ), జనవరి 30:** నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాలని సెక్టోరల్ అధికారులను కర్నూలు అసెంబ్లీ ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవతేజ ఆదేశించారు. మంగళవారం ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో సెక్టోరల్ అధికారులు, పోలీసు అధికారులతో సాధారణ ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ కనీస వసతులు ఉన్నాయా..లేదా అనే విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. పంచాయతీరాజ్ డీఈ శిల్పాశ్రీ, ఎస్ఎస్ఏ ఈఈ కర్రెన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహీద్దీన్, సీఐలు పాల్గొన్నారు

## నిధులు దారి మళ్లించారు: వై.నాగేశ్వరరావు

**కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 30:** కేంద్ర ప్రభుత్వం ఎన్‌సీడీసీ సంస్థ ద్వారా రాష్ట్రంలోని గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాలకు రూ.200 కోట్లకు పైగా నిధులను మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని దారి మళ్లించారని గొర్రెలు, మేకల పెంపకందా రుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం కర్నూలు నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏపీలో గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాల పెంపకందారులకు కేంద్ర ప్రభుత్వం జీవనోపాధిని మెరుగు పరుచుకునేందుకు రూ.200 కోట్లకు పైగా మంజూరు చేసిందన్నారు. మొదటి విడత నిధులను పంపిణీ చేశారని, రెండో విడత నిధులను విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని చూపడం దారుణమని విమర్శిం చారు.

## జూనియర్ సివిల్ న్యాయాధికారులకు సన్మానం

**కర్నూలు(లీగల్), జనవరి 30:** నూతనంగా ఎంపికైన కర్నూలుకు చెందిన ఇద్దరు మహిళా జూనియర్ సివిల్ న్యాయాధికారులు జశ్వంతి యాదవ్, శివనమ్రతలకు మంగళవారం ఐలు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది కెంగార కుమార్ మాట్లాడుతూ నూతన జూనియర్ సివిల్ న్యాయాధికారులకు కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని కోరారు. ఈసమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి. నాగభూషణం నాయుడు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## డీఈవోకు సన్మానం

**కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 30:** కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం డీఈవో రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో పదవీ విరమణ పొందనున్న డీఈవో రంగారెడ్డిని సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ శాలువ కప్పి సన్మానించారు. వల్లపురెడ్డి రంగారెడ్డి, శ్రీనివాసు యాదవ్, హనుమంతరావు, వెంకటరమణారెడ్డి, నారాయణ, హుశేన్, రమేష్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

## కర్నూలు-1 డిపో ఎదుట ఎన్ఎంయూ ధర్నా

**కర్నూలు(రూరల్), జనవరి 30:** రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కర్నూలు-1 ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా చేశారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి పీఎండీ ఇస్మాయిల్, జిల్లా కార్యదర్శి సి.మద్దిలేటి పాల్గొని ప్రసంగించారు. విశాఖపట్నం ప్రజా రవాణా అధికారి ఉద్యోగులపై తక్షణమే వేధింపులు మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎఆర్ నాయుడు, పీఏ వలి, రంగన్న, ఇసాక్, కార్మికులు పాల్గొన్నారు.

## కొత్త రైళ్లకు నిధుల కేటాయించాలి: సీపీఎం

**కర్నూలు(రూరల్), జనవరి 30:** జిల్లాలో కొత్త రైల్వే లైన్ల నిర్మాణంతో పాటు అదనపు రైళ్ల కోసం ఈ ఏడాది ప్రవేశపెట్టె బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి.నిర్మల కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కర్నూలు రైల్వేస్టేషన్ ముఖద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, నారాయణ, రాముడు, నగేష్, నరసింహులు, ప్రభాకర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

## ఎస్ఐ బదిలీని నిలిపివేయాలి

**కోడుమూరు, జనవరి 30:** నీతి నిజాయితీతో పనిచేస్తున్న ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు బదిలీ వెంటనే నిలిపివేయాలని సీపీఎం, సీపీఐ, ఏఐఎస్ఎఫ్ కుల, ప్రజా సంఘాల నాయకులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకుడు కృష్ణ మాట్లాడుతూ ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు ఇక్కడికి వచ్చి కేవలం 8నెలలు మాత్రమే అయిందని, ఆయన శాంతిభద్రతలను అదుపులోకి తీసుకరావడమే కాకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారని అన్నారు. నాయకులు వీరన్న, గఫూర్‌మియా, రంగస్వామి, మధు పాల్గొన్నారు.

## హాకీ ఎంపిక పోటీలు ప్రారంభం

**కర్నూలు(స్పోర్ట్స్), జనవరి 30:** స్థానిక ఎస్టీబీసీ కళాశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి హాకీ బాలుర, బాలికల ఎంపిక పోటీలను మంగళవారం జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు బి.రామాంజనేయులు ప్రారంభించి మాట్లాడారు. హాకీ కర్నూలు కార్యదర్శి దాసరి సుధీర్, సాఫ్ట్‌బాల్ సంఘం ప్రతినిధి గంగాధర్, హాకీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రవీణ్ పాల్గొన్నారు.

## క్రికెట్ విజేత గోరంట్ల

**కోడుమూరు(రూరల్), జనవరి 30:** ఆడుదాం ఆంధ్ర టోర్నీలో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ ఫైనల్ పోటీలో గోరంట్ల జట్టు విజేతగా నిలిచింది. గోరంట్ల జట్టు సెమీ ఫైనల్‌లో కర్నూలు జట్టుపై విజయం సాధించి సి.బెళగల్ జట్టుతో ఫైనల్ పోటీలో తలపడింది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గోరంట్ల జట్టు బ్యాంటింగ్ ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసింది. అనంతరం సి.బెళగల్ జట్టు 10 ఓవర్లు ఆడి 102 పరుగులు మాత్రమే చేసింది. 32 పరుగులతో గోరంట్ల జట్టు విజయం సాధించి జిల్లాస్థాయికి ఎంపికైంది. తహసీల్దార్ జయన్న విజేత జట్టుకు మెడల్స్ ట్రోఫీ అందించి అభినందించారు. కార్యక్రమంలో సి.బెళగల్ ఎంపీడీవో శ్రీనివాసులు, వీర్యేలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ సేవలు

- అరుదైన ఆపరేషన్లు చేసిన వైద్యులు
- అభినందించిన సూపరింటెండెంట్


అరుదైన ఆపరేషన్ చేసిన యురాలజీ, నెఫ్రాలజీ అనస్థీషియా హెచ్‌వోడీలను సన్మానిస్తున్న సూపరింటెండెంట్

**కర్నూలు(హాస్పిటల్), జనవరి 30:** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కార్పొరేట్ స్థాయిలో అరుదైన ఆపరేషన్లు నిర్వహించారని, దీన్ని వైద్యులు స్ఫూర్తిగా తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.వెంకట రంగారెడ్డి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పి టల్‌పై ఆయన హెచ్‌వోడీలతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్సలు చేసిన యురాలజీ హెచ్‌వోడీ సీతారామయ్య, నెఫ్రాలజి హెచ్‌వోడీ అనంత్, న్యూరోసర్జరీ హెచ్‌వోడీ మోహన్ శశాంక్, రామ్ బాలాజీ, అనస్థీషియా హెచ్‌వోడీ విశాల్‌లను సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ హరి చరణ్, సీఎస్ ఆర్ఎంవో వెంకటేశ్వరరావు, ఆర్ఎంవో వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## టీడీపీ విజయానికి కృషి చేస్తా

### చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన పుసులూరు ప్రభాకర్‌రెడ్డి


చంద్రబాబు సమక్షంలోటీడీపీలో చేరుతున్న పుసులూరు ప్రభాకర్‌రెడ్డి

**కల్లూరు, జనవరి 30:** త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి శాయశక్తులా కృషి చేస్తానని టీడీపీ నాయకుడు పుసులూరు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. వైసీపీలో కొనసాగుతున్న ఆయన తాజాగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. పాణ్యం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గౌరు చరిత, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో పుసులూరు ప్రభాకర్‌తో పాటు ఆయన అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో టీడీపీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఫిబ్రవరి 4న పుసులూరు గ్రామంలో గౌరు దంపతుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. కల్లూరు మండలం నుంచి ఇకపై టీడీపీలో చేరికలు అధికంగా ఉంటాయన్నారు.

## సౌదీలో కర్నూలు వాసికి కీలక బాధ్యతలు

### కాన్సుల్ జనరల్‌గా ఫహాద్ సూరి నియామకం



**(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి):** అరబ్ దేశాల్లో అత్యంత కీలకంగా భావించే సౌదీ అరేబియాలోని జెద్దాలో భారత కాన్సుల్ జనరల్‌గా తెలుగు యువ దౌత్యవేత్తను నియమించారు. 2014 బ్యాచ్‌కు చెందిన ఫహాద్ అహ్మద్ సూరి భారత కాన్సుల్ జనరల్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన వాణిజ్య మంత్రిత్వ శాఖలో మధ్యప్రాచ్య, ఉత్తర ఆఫ్రికా దేశాలతో భారత ఎగుమతులు, దిగుమతుల వ్యవహారాలను పరిశీలిస్తున్నారు. అంతకు ముందు కువైత్‌లోని భారతీయ ఎంబసీలో పనిచేశారు. కర్నూలు నగరంలోని ఒక ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన ఫహాద్ స్థానిక జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో చదివారు. ఆ తర్వాత బెంగ ళూరులో ఎంబీఏ చేశారు. లండన్‌లో బ్యాంకర్‌గా పనిచేసిన అనంతరం ఐఎఫ్ ఎస్‌కు ఎంపికయ్యారు. రాజకీయ, సైనిక, లక్షలాది మంది హజ్ యాత్రికుల రాకపోకల దృష్ట్యా జెద్దాలోని కాన్సుల్ జనరల్ పోస్టింగ్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పటి వరకు జెద్దాలో పనిచేసిన షాహీద్ ఆలంను లండన్‌లోని భారతీయ హై కమిషన్‌కు బదిలీ చేశారు.

## 58.5 కిలోల వెండి స్వాధీనం

**కర్నూలు, జనవరి 30:** నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద సతీష్, జగదీష్ అనే వ్యక్తుల నుంచి 58.5 కిలోల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి తనిఖీలు చేస్తుండగా.. సతీష్ అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని పరిశీలిస్తే.. అతని వద్ద ప్లాస్టిక్ కవర్‌లో వెండి ఆభరణాలు గుర్తించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తే తమిళనాడు రాష్ట్రం సేవ్‌పేట్ టౌన్‌కు చెందిన వ్యక్తిగా తెలిపాడు. తక్కువ ధరకు వెండి బిస్కెట్లు కొని ఇంట్లోనే ఆభరణాలు తయారు చేసి ఎలాంటి బిల్లులు లేకుండా కర్నూలు షరాఫ్‌బజారులోని కొంత మంది వ్యాపారులకు, నంద్యాల జిల్లాలోని కొందరు వ్యాపారులకు విక్రయిస్తుంటాడని తెలిపారు. అతడి వద్ద లభించిన 58.5 కిలోల వెండి ఆభరణాలకు ఎలాంటి బిల్లులు లేకపోవడంతో పోలీసులు సీజ్ చేశారు. వాటి విలువ రూ.45.33 లక్షలు ఉంటుందని, అతడిపై వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

# ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

## వైభవంగా సుంకులా పరమేశ్వరి దేవర



బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

**మద్దికెర, జనవరి 30:** మండల కేంద్రం సాయినగర్ కాలనీలో ని నలవేలి సుంకులా పరమేశ్వరి అమ్మవారి దేవర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మంగళవారం మూలవిరాట్ సుంకులా పరమేశ్వరి అమ్మవారిని నిమ్మకాయలతో, పుష్పాలతో, ఆకులతో అలంకరించారు. అనంతరం సాయిబాబా గుడి నుంచి కాలనీలోని మహిళలందరూ బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచు బండారు సుహాసిని, ఎంపీపీ అనితాయాదవ్, జడ్పీటీసీ సభ్యుడు డి.మురళీధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రాజన్న యాదవ్, టీడీపీ జిల్లా కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు, మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు తదితరులు ఉన్నారు.

**నేడు బొమ్మనపల్లిలో దేవర ఉత్సవాలు:** మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ఐదేళ్లకోసారి జరుపుకునే సుంకులమ్మ దేవర బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభం కానుంది. మంగళవారం సుంకులమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి, పందిరి వేశారు.

## 'సంక్రాంతి కానుకను ఇవ్వాలి'

**ఎమ్మిగనూరు, జనవరి 30 :** మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు సంక్రాంతి కానుకను ఇవ్వాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, వీరేష్, ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులతో కలిసి మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు 16రోజులు సమ్మె చేసి జీఓ 12ను సాధించారని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం కార్మికులకు సంక్రాంతి కానుకగా రూ.1000 మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, నాగరాజు, యల్లప్ప, ప్రతాప్, శివ, రవి, మల్లికార్జున, లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.

## రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం : టీడీపీ



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

**కౌతాళం, జనవరి 30:** మృతి చెందిన తెలుగుదేశం కార్యకర్త రమేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని టీడీపీ నాయకులు మాధవరం రాఘవేంద్ర రెడ్డి, ఉలిగయ్య అన్నారు. మంగళవారం వారు విలేకరులకు వివరాలు వెల్లడించారు. పత్తికొండలో జరిగిన 'రా కదలిరా' సభకు హల్వి గ్రామానికి చెందిన రమేష్ హాజరయ్యాడని తెలిపారు. సభ ముగిసిన తరువాత తిరుగు ప్రయాణంలో అస్వస్థతకు గురికాగా గ్రామ కార్యకర్తలు ఆదోనిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని, తాము వెళ్లి పరామర్శించి వచ్చామని పేర్కొన్నారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేయగా కర్నూలులోని అమిలియో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్త భౌతిక కాయాన్ని సందర్శించి అంత్యక్రియలకు రూ.25వేలు ఆర్థిక సాయాన్ని మాధవరం రాఘవేంద్రరెడ్డి అందజేశారు. నివాళి అర్పించిన వారిలో పార్టీ నాయకులు సురేష్‌నాయుడు, సిద్దప్ప, గోవిందు, రామలింగ, రోహిత్‌లు ఉన్నారు.

## పత్తికొండ అసెంబ్లీ సీటు యాదవులకు ఇవ్వాలి

**మద్దికెర, జనవరి 30:** వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ సీటు యాదవులకే కేటాయించాలని, లేని పక్షంలో స్వతంత్రంగా బరిలో దిగి తమ సత్తా చూపుతామని యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ యాదవ్, ఎంపీపీ భర్త వైసీపీ నాయకుడు బి.శ్రీనివాసులు యాదవ్ అన్నారు. మంగళవారం మండల యాదవ సంఘం అధ్యక్షుడు టైలర్ గోపాల్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో యాదవుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ ఒక్క అసెంబ్లీ సీటు కూడా ఇవ్వలేదన్నారు. వైసీపీ, టీడీపీ అధిష్టానాలు గమనించి యాదవ కులస్థులకు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని కోరారు. 25 అసెంబ్లీ, 5 ఎంపీ స్థానాలను యాదవులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాదవులంతా ఐక్యతతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కవిరెడ్డి కృష్ణ, కవిరెడ్డి గోపాల్, ప్రతాప్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు అభివృద్ధికి కృషి

● నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి



మాట్లాడుతున్న ఆలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి

**చిప్పగిరి, జనవరి 30 :** అందరి సహకారంతో ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైసీపీ చిప్పగిరి మండల కన్వీనర్ జూటూరు మారయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జగన్ చేస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి గెలిపిస్తాయని అన్నారు. అందరినీ కలుపుకుపోయి వైసీపీని బలోపేతం చేస్తామన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు నిర్మిస్తామన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. నగరడోణ, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మల్లికార్జున, నాయకులు బర్న మల్లికార్జున, ఓబులేషు, నాగప్ప, మంజు, లాల్ స్వామి, నాగేంద్ర, సేనాపతి, ఈరన్న పాల్గొన్నారు.

## ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.50వేలు విరాళం

**చిప్పగిరి, జనవరి 30 :** మండల కేంద్రంలోని భంభం సాబ్ దర్గా సమీపంలో ఉన్న శ్మశాన వాటిక ప్రహరి గోడ నిర్మాణం కోసం మంగళవారం ఆలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విరుపాక్షి రూ.50వేలు విరాళం అందించారు. ముస్లిం మైనారిటీల సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.

## చిన్నారి ఆలనా..పాలనకు.. మల్లెల బరోసా

**ఎమ్మిగనూరు, జనవరి 30 :** మండల పరిధిలోని కలుగోట్ల గ్రామంలో తల్లి రోజా మృతిచెందటంతో ఆలనా..పాలనకు దూరమైన చిన్నారి పోషణకు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల అల్‌ఫ్రెడ్ రాజు బరోసా ఇచ్చారు. మంగళవారం కలుగోట్ల గ్రామనికి వెళ్లి అవ్వా తాతల ఇంట్లో ఉంటున్న చిన్నారిని చూసి ఆలనాపాలన గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. కాగా గ్రామానికి చెందిన మారెప్ప, ఇందిరమ్మల కుమార్తె రోజా(28). ఈమెకు ముగ్గురు కుమారులు. మూడో కుమారునికి జన్మనిచ్చిన మూడు నెలల వ్యవదిలో రోజా గొంతు క్యాన్సర్‌తో మృతిచెందింది.

# పశ్చిమాన తాగునీటి ముప్పు

- జీడీపీ నీరు కోడుమూరుకు విడుదల
- రోజుకు 30 క్యూసెక్కుల నీరు కిందకు
- ప్రాజెక్టులో కేవలం 1.05 టీఎంసీల నీరు మాత్రమే

**గోనెగండ్ల, జనవరి 30:** వేసవి కాలం రాకముందే జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ ప్రాంతాలలో తాగునీటి సమస్య తీవ్రమవుతోంది. కోడుమూరు, కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, డోన్ ప్రాంతాలకు గాజులదిన్నె ప్రాజెక్టు నీరే తాగునీటి పథకాలకు శరణ్యం. అయితే, ప్రాజెక్టులో ఈ ఏడాది నీటి నిలువ పూర్తిగా అడుగంటి పోయింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.05 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీటితోనే ఈ ఏడాది జూలై నెల వర్షాలు కురిసే వరకు ఐదు నియోజకవర్గాలకు తాగునీరు అందించాల్సి ఉంది. ఈ ఏడాది వర్షాలు కురవకపోవడంతో వేసవి రాక ముందే కోడుమూరు, గోరంట్ల ప్రాంతాలలో తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో గత రెండు రోజుల క్రితం జీడీపీ అధికారులు కోడుమూరు, గోరంట్లకు తాగునీటి కోసం ఎడమ కాలువ ద్వారా రోజుకు 30 క్యూసెక్కుల ప్రకారం నీటిని విడుదల చేస్తున్నారు. పది నుంచి పన్నెండు రోజుల పాటు నీటి విడుదల చేస్తున్నట్లు జీడీపీ అధికారులు చెబుతున్నారు. వేసవి రాకముందే తాగునీటి సమస్య తీవ్రమైతే జూలై నెల వరకు జీడీపీ నీరు పలు పట్టణాల తాగునీటి పథకాలకు సరిపోవు. దీంతో తాగునీటి కష్టాలను ఎలా ఎదుర్కోవాలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎల్లెల్సీ నీటిని విడుదల చేసి జీడీపీలో నిలువ చేసి అవసరమైన సమయంలో తాగునీటి పథకాలకు మళ్లించాల్సి ఉంటుంది.



జీడీపీ ఎడవ కాలువ ద్వారా కోడుమూరుకు నీటి విడుదల

## 'విద్యా కానుక' నిధుల స్వాహాపై విచారణ

**గోనెగండ్ల, జనవరి 30:** 2023-24 విద్యాసంవత్సరంలో గోనెగండ్ల మండలంలోని పలు పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్ లను పాఠశాలలకు సరఫరా చేసే నిధులను అప్పటి ఎంఈవో వినోద్‌కుమార్ స్వాహా చేశారని ఆరోపణలు రావడంతో మంగళవారం ఆదోని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి గోనెగండ్ల ఉపాధ్యాయులు, సీఆర్పీలతో విచారణ చేపట్టారు. అప్పటి రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను జరిగి విషయంపై ఆరా తీశారు. ఈ విషయం పై విచారణ అధికారి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో గోనెగండ్ల మండలంలోని పలుపాఠశాలలకు జగనన్న విద్యాకానుక కింది విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు అందించారు. అయితే ఎంఈవో కార్యాలయం నుంచి పాఠశాలలకు చేర్చే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఎంఈవో కార్యాలయం నుంచి పాఠశాలలకు చేర్చే విషయంలో ప్రభుత్వం నుంచి విడుదలయిన సొమ్మును అప్పటి ఎంఈవో వినోద్‌కుమార్ స్వాహా చేశారని పలు విద్యార్థి సంఘాలు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యాకానుకలో వచ్చే సొమ్మును కూడా స్వాహా చేసే అధికారులు ఉంటారా అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఉపాధ్యాయులను విచారణ చేస్తున్న డీప్యూటీ డీఈవో

## విధి నిర్వహణలో అలసత్వం తగదు

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం

**ఆదోని టౌన్, జనవరి 30 :** విధి నిర్వాహణలో అధికారులు, సిబ్బందికి అలసత్వం సరికాదని మహిళా కౌన్సిలర్ నాగరత్నమ్మ అన్నారు. మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బోయ శాంత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2010లో ఒకరు 2017లో మరొకరు మున్సిపల్ కార్యాలయానికి చెల్లించిన ఆస్తి, నీటి పన్నులు ఇంత వరకు ఎందుకు జమ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత కాలం ఎందుకు పట్టించుకోలేదని, ఇది అధికారుల నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోందని అన్నారు. కౌన్సిలర్ చలపతి మాట్లాడుతూ పట్టణ పొలిమేరలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ప్రవహిస్తున్న పెద్ద వంకలో కొందరు చెత్త, చెదారాన్ని పారవేయడంతో మురికి నీరు ముందుకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పక్కనున్న లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి వంక నీరు పారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ ముల్లా గౌస్ మాట్లాడుతూ పట్టణంలోని మాంసం విక్రయాలు జరిగే రెండు, మూడు ప్రాంతాలలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఈ దారి గుండా రాకపోకలు సాగించే వారి పై దాడులకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో కమిషనర్ రఘునాథ్ రెడ్డి అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ఎంఈ రాధాకృష్ణ పట్టణ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెవెన్యూ అధికారులు అస్లాం బాషా, డీఈ నాగభూషణం రెడ్డి, ఏఈ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్ రఘు

## సిలిండర్ పేలి గుడిసె దగ్ధం

● రెండు తులాల బంగారం, రూ.60వేల నగదు, రూ. 4 లక్షల ఆస్తి నష్టం

**హొళగుంద, జనవరి 30 :** మండలంలోని హెబ్బటం గ్రామంలో వంట గ్యాస్ సిలిండర్ పేలి భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. రాఘవేంద్ర కుటుంబం పొలం పనుల నిమిత్తం ఉదయమే వెళ్లారు. తల్లి టీ చేసుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగులు తీయగా, గుడిసె మొత్తం మంటలు వ్యాపించినట్లు తెలిపారు. దీంతో బీరువాలోని రెండు తులాల బంగారు నెక్లెస్, రూ.60వేల నగదు, 4 క్వింటాళ్ల బియ్యం, మూడు క్వింటాళ్ల జొన్నలు, 7 క్వింటాళ్ల సజ్జలు, 14 సంచుల వడ్లు, సామాన్లు, బట్టలు మొత్తం అన్ని కాలి బూడిద అయినట్లు తెలిపారు. కట్టుబట్టలతో సహా రోడ్డు మీద పడ్డామని కన్నీటి పర్యంతం అయ్యాడు. ఆస్తి నష్టం నాలుగు లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. తహసీల్దార్ హుసేన్ సాబ్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వం నుండి సహాయం అందేలా చేస్తామని హామీ ఇచ్చారు.

## 'టీడీపీని ఆదరించండి'



ఉపాధి కూలీలకు కరపత్రాలు అందిస్తున్న బెంగళూరు కిషోర్

**ఆలూరు, జనవరి 30 :** రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి గెలిపిస్తే అందరి సమస్యలు తీరి, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బెంగళూరు కిషోర్ అన్నారు. మంగళవారం ఆలూరు శివారులో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తూ, మరో వైపు ధరలు పెంచి లాక్కుంటోందని విమర్శించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

## పోలీసుఅధికారులకు సన్మానం

**పత్తికొండ, జనవరి 30 :** జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పత్తికొండ మైత్రిచారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు పోలీసు అధికారులను సన్మానించారు. గణతంత్ర వేడుకలలో ఉత్తమ అధికారులుగా అవార్డును అందుకున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పత్తికొండ టౌన్‌సీఐ మురళీమోహన్, తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున, ఎస్బీకానిస్టేబుల్ వీరేంద్రలను సంస్థనిర్వాహకులు రాంమోహన్ శాలువాతో సత్కరించి వారికి డైరీలను అందించారు. ఈకార్యక్రమంలో సంస్థసభ్యులు ఉన్నారు.

## నేడు పీఎం జన ఔషధ కేంద్రం ప్రారంభం

**కౌతాళం, జనవరి 30:** స్థానిక సహకార సంఘంలో బుధవారం ప్రధాన మంత్రి భారతీయ జన ఔషద కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు దాట్ల క్రిష్ణంరాజు, సీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఒకరి కోసం అందరూ అందరి కోసం ఒకరు' నినాదంతో కౌతాళం సహకారం సంఘంలో ఈ ఔషద కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

## సేంద్రియ పద్ధతులపై చైతన్యం రావాలి

**ఆదోని (అగ్రికల్చర్), జనవరి 30 :** సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో చైతన్యం రావాలని జీవదాయక వ్యవసాయ క్షేత్రం డైరెక్టర్ డాక్టర్ డానియేల్ ప్రేమ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆదోని ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రత్యేక శిబిరం మాలపల్లి, రచ్చుమర్రి గ్రామాల్లో నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ చేపట్టిన రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీవసేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయ ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. జీవ సేంద్రియ పంట ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ విక్లిఫ్ పాల్గొన్నారు.

## నిధుల కొరత వేధిస్తోంది

● పంచాయతీ సమావేశంలో సర్పంచు స్పష్టీకరణ

**మద్దికెర, జనవరి 30:** పంచాయతీకి నిధుల కొరత వేధిస్తోందని, అందువల్లే గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని మద్దికెర సర్పంచు బండారు సుహాసిని అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచు బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ సభ్యులు జమేదార్ జంబునాథ్ నాయుడు, వెంకట్రాయుడు మాట్లాడుతూ మేం పంచాయతీ సభ్యులుగా ఎంపికై రెండేళ్లు దాటిందని, ఇంత వరకు మా ప్రాంతాల్లో ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మేం తెలుగుదేశం పార్టీ వారమని మా ప్రాంతాలపై నిర్లక్ష్యం వహిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. జాతర మహోత్సవాలు మరో నెల రోజుల్లో జరుగుతాయని, ఇంత వరకు సదుపాయాల కల్పన చేపట్టలేదని పేర్కొన్నారు. నీటి సమస్యతో మా ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నా మీకు పట్టదా అంటూ నిలదీశారు. సర్పంచు బండారు సుహాసిని మాట్లాడుతూ పంచాయతీకి నిధుల కొరత వేధిస్తోందని, పార్టీలకతీతంగా గ్రామాలభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు ఎల్.లక్ష్మినారాయణ, చంద్రశేఖర్ గౌడు, ఎంపీటీసీ ఆంజనేయులు, బాలచంద్ర, వరప్రసాద్, ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, ఆమాంజనేయులు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈవోఆర్‌డీ మద్దిలేటి స్వామి

## ఆర్లబండ ఖాళీ !

- ఒకేరోజు 200 కుటుంబాలు గుంటూరుకు పయనం
- ఉపాధి పనుల్లేక ఊరు వదిలిన కూలీలు
- చోద్యం చూస్తున్న అధికారులు

**కోసిగి, జనవరి 30:** మండల పరిధిలోని ఆర్లబండ గ్రామం నుంచి ఒకే రోజు 200 కుటుంబాల వలస కూలీలు లారీలు, బొలేరో వాహనాల్లో గుంటూరుకు వలసబాట పట్టారు. గ్రామంలో ఉపాధి పనులు లేక వలస వెళ్తున్నట్లు కూలీలు కన్నీరు మున్నీరై విలపించారు. చేసిన పనులకు కూడా ఉపాధి వేతనాలు రాకపోవడంతో వలసలు తప్పడం లేదని కూలీలు ఆవేదన చెందారు. మంగళవారం రాత్రి వేళల్లో చంటి పిల్లలను పట్టుకుని పిల్లాపాపలతో కలిసి లారీల్లో గుంటూరుకు వలసబాట పట్టారు...



గుంటూరుకు బయలుదేరిన ఆర్లబండ కూలీలు



## అందరి సహకారంతోనే సభ సక్సెస్



మాట్లాడుతున్న కేఈ శ్యాంబాబు

**పత్తికొండ, జనవరి 30 :** పత్తికొండలో జరిగిన రాకదలిరా బహిరంగసభ విజయవంతానికి కృషిచేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఈ శ్యాంబాబు అన్నారు. మంగళవారం పత్తికొండ కార్యాలయ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు పార్లమెంటరీ పరిధిలో రాకదలిరా కార్యక్రమానికి పార్టీ పత్తికొండను ఎంపిక చేయడంతో లక్షమందితో బారీబహిరంగసభ ఏర్పాటుచేయాలని బావించామన్నారు. ఇందుకోసం జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, ఇన్‌చార్జిలు మీనాక్షినాయుడు, తిక్కారెడ్డి, టీజీభరత్, కోట్లసుజాతమ్మ, జయనాగేశ్వరరెడ్డి, ఆకెపోగు ప్రబాకర్‌లతోపాటు విష్ణువర్ధన్‌రెడ్డి తమవంతుసహకారాన్ని పూర్తిస్థాయిలో అందించారన్నారు. దీనికి తోడు టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయడంతో లక్షమందితో నిర్వహించాలనుకున్న బహిరంగసభకు లక్షన్నదాటి హాజరయ్యారని, అతిపెద్ద బహిరంగసభగా పత్తికొండ చరిత్రలో నిలిచిపోయిందని వివరించారు.

## మహాత్మాగాంధీకి ఘన నివాళి



గాంధీజీకి నివాళి అర్పిస్తున్న ఆదోని కాంగ్రెస్ నాయకులు

**ఆదోని టౌన్, జనవరి 30 :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, మిరియాల శ్రీధర్ మాట్లాడుతూ తమ సంస్థ తరపున ఏడాదిగా ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్నామని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో :** బాపూజీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు నీలకంఠప్ప, మాజీ కౌన్సిలర్ దిలీప్ ధోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి రావు, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, శ్రీనిత్, జయరాం, మాణిక్యరాజు పాల్గొన్నారు.

**ఆలూరు:** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు విద్యార్థులతో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధి దేశానికి చేసిన సేవలను ఆయన వివరించారు.

## మధ్యాహ్న భోజనం పరిశీలించిన డీప్యూటీ డీఈవో

**గోనెగండ్ల, జనవరి 30:** స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నభోజన పథకాన్ని ఆదోని డిప్యూటీ డీఈవో వెంకటరమణారెడ్డి పరిశీలించారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.. ఎంత మంది హాజరయ్యారు. మెను ప్రకారం భోజనం వడ్డించారా లేదా అని ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచికరంగా ఉందా లేదా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

## ఆర్టీసీ కార్మికుల నిరసన

**ఆదోని టౌన్, జనవరి 30 :** ఆర్టీసీ ఎన్ఎంయూ సభ్యుల పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆదోని ఆర్టీసీ డిపో ఎదుట మంగళవారం కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య సలహాదారులు లక్ష్మన్న, అధ్యక్షుడు ఆరోగ్యప్ప మాట్లాడుతూ విశాల డీపీటీవో సంస్థకు నష్టం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్నారని, కార్మికుల పట్ల అకారణంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ పద్ధతిలో కండెక్టర్, డ్రైవర్లకు డ్యూటీ చార్ట్ వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో సెక్రెటరి హరిబాబు, గ్యారెజ్ సెక్రెటరి షరీఫ్, రామలింగప్ప, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ఆదోని రూరల్, జనవరి 30 :** ఆదోనికి చెందిన రాఘవేంద్ర, పెద్దకడుబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన బోయ కొండయ్యలు ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా ఇస్వీ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం వీరు ఇరువురు శిరుగుప్ప ప్రధాన రహదారిలో ఉన్న ఎల్లెల్సీ కాల్వ వద్ద అక్రమంగా కర్ణాటక నుంచి మద్యాన్ని తరలిస్తుండగా, అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 1,152 కర్ణాటక ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ శ్రీనివాసులు తెలిపారు.

**మంత్రాలయం :** మంత్రాలయం మండలంలోని మాధవరం చెక్‌పోస్టు వద్ద కర్ణాటక నుంచి ఆటోలో కర్ణాటక మద్యం తెస్తుండగా.. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ కిరణ్‌బాబు వివరాల మేరకు.. ఆటోలో 96 ఒరిజినల్ చాయిస్ టెట్రా ప్యాకెట్లను మంత్రాలయం మండలం కాచాపురం గ్రామానికి చెందిన దినకరణ్ అనే వ్యక్తి కర్ణాటక మద్యం తెస్తుండగా పట్టుకున్నారు.

## అనాథ పిల్లలకు జై భీం ఎమ్మార్పీఎస్ చేయూత

**మంత్రాలయం, జనవరి 30:** మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారిన ముగ్గురు కుమారులకు జైభీం ఎమ్మార్పీఎస్ చేయూతనందించింది. మంగళవారం జైభీం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కిం జానయ్య, జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల, నియోజకవర్గ దేవరపాటి అనిల్ అనాథ పిల్లలను పరామర్శించి 25 కేజీల బియ్యం, 6 కేజీల కందిపప్పు, 15 లీటర్ల మంచినూనె, దినసర సరుకులు అందజేశారు. దళిత అనాథ పిల్లలను ప్రభుత్వం నెలకు రూ.10వేల పింఛన్, రెండెకరాల పొలం, రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

## ఎన్‌ఎంఎంఎస్‌కు 9 మంది విద్యార్థుల ఎంపిక

**పెద్దకడుబూరు, జనవరి 30:** స్థానిక మోడల్ పాఠశాలలో 8వతరగతి చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు (ఎన్ఎంఎంఎస్) ఎంపికయ్యారని ప్రిన్స్‌పాల్ రంగన్న మంగళవారం తెలిపారు. విద్యార్థులు మంచోది సాగర్, మణికూమారి, సబీనా, సమ్రీన్, రాకేష్, ధరణిదర్ రెడ్డి,కిషోర్, ఇందు, దాదా కలందర్‌లను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

## గోనెగండ్ల కు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల

**గోనెగండ్ల, జనవరి 30:** గ్రామపంచాయతీలలో పలు అభివృద్ధి పనులు చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుందని ఇందలో భాగంగా గోనెగండ్ల మండలానికి రూ. 1,50,08,599 విడుదల అయినట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ నిధులతో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్‌బిల్లులు, పంచాయతీ తీర్మానం తో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టవచ్చని ఆయన తెలిపారు.